క్లుప్తంగా

కార్మిక, వైఎస్సార్ సీపీ నేత ముమ్మన కన్నుమూత


ముమ్మన సత్యనారాయణ (ఫైల్)

పెద్దాపురం(సామర్లకోట): వైఎస్సార్ సీపీ పెద్దాపురం పట్టణ నాయకుడు, కార్మిక సంఘ నేత ముమ్మన సత్యనారాయణ(70) బుధవారం కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద మరణించారు. ఆయన భౌతికకాయానికి పార్టీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మిక సంఘ అధ్యక్షుడిగా, నాయకుడిగా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విశేష కృషి చేశారని సాయిప్రసాద్ కొనియాడారు. పెద్దాపురం సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, రొంగల వీర్రాజు తదితరులు సంతాపం ప్రకటించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కరప: బాణసంచా తయారీదారులు నిబంధనలు అతిక్రమించి మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కరప ఎస్సై టి.సునీత, ఆర్ఐ పవన్‌తో కల్సి ఆయన మండలంలోని వేళంగి, గొర్రిపూడి, నడకుదురు గ్రామాల్లోని బాణసంచా తయారీకేంద్రాలను బుధవారం తనఖీ చేశారు. బాణసంచా తయారీదారులు భద్రతా నియమాలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అనుమతి లేకుండా బాణసంచా తయారు చేయడం, నిల్వ ఉంచడం చేయరాదన్నారు. తయారీ కేంద్రం వద్ద ఇసుక, నీరు, అగ్నిమాపక యంత్రపరికరం అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలు, చిన్నారులతో బాణసంచా తయారు చేయించరాదన్నారు. ఫస్ట్ ఎయిడ్ బ్యాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. అంబులన్స్ రాకపోకలు అనుకూలంగా రోడ్డు మార్గం ఉండాలన్నారు. గ్లౌజులు, సేఫ్టీ గాగుల్స్, మాస్కులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో నిబంధనలు, అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలిచ్చారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపులు

కరప: ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను చెల్లించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వి.వారిజ పాల్గొన్నారు.

ఫెస్టి నిల్..!

- ఎక్కడా కానరాని పండగ సందడి
- పిండి వంటలంటే జనం హడల్
- నిత్యావసర వస్తువులపై తగ్గని జీఎస్టీ

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో దసరా సందడి కానరావడం లేదు. గతంలో దసరా సెలవుల్లో కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వెళ్లి సందడిగా గడిపేవారు. నేడు ఆ సందడి, పిండివంటల తయారీ ఎక్కడా కనిపించడం లేదు. నియోజకవర్గానికి చెందిన అనేక మంది హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఉద్యోగాల కోసం తరలివెళ్లారు. ఏటా దసరాకు వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారు. దూర ప్రాంతాల నుంచి వారు రైళ్లు, బస్సుల్లో ప్రయాణం చేయాలి. టిక్కెట్లు లభించక పోవడం, టిక్కెట్ల ధరలు గణనీయంగా పెరగడంతో పండగ ప్రయాణం భారంగా మారింది.

వస్త్ర దుకాణాలు వెలవెల

నియోజకవర్గంలో దసరా వచ్చిందంటే పది రోజుల ముందుగానే వస్త్ర దుకాణాల్లో సందడి ఉండేది. పిల్లలు, పెద్దలు, మహిళలు కొత్త దుస్తులు కొనుగోలు చేయడానికి షాపులకు తరలిరావడంతో వ్యాపారాలు జోరుగా సాగేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ వ్యాపారం అందుబాటులోకి రావడంతో వినియోగదారులు అక్కడే ఆర్డర్లు ఇస్తున్నారు. పెద్ద వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ వ్యాపారం దండిగా చేస్తుండడంతో.. చిరు వ్యాపారులకు అంతంతమాత్రంగానే వ్యాపారం జరుగుతుంది. ఆన్‌లైన్ వ్యాపారాలు ఊపందుకోవడంతో, దుకాణాల అద్దెలూ చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని చిన్న వ్యాపారులు వాపోతున్నారు.

చేతిలో చిల్లిగవ్వలేక..

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి వర్గాల్లో చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో దసరా సందడి కానరావడం లేదు. వ్యవసాయ పనులు, భవన నిర్మాణ పనులు లేకపోవడంతో కూలీల చేతిలో సొమ్ముల్లేని పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఇళ్ల నిర్మాణ పనులు ఎక్కువగా జరుగుతూండటంతో కూలీలకు చేతినిండా పని, జేబుల నిండుగా డబ్బు ఉండేది. దసరా పండగ సమయంలో వైఎస్సార్ చేయూత, వసతి దీవెన, రైతు భరోసా వంటి పథకాలతో బ్యాంకు ఖాతాల్లో సొమ్ము పడడంతో పండగను ఆనందంగా చేసుకునే వారు.

సెల్‌ఫోన్ షాపుల్లో సందడి

జీఎస్టీ తగ్గడంతో కొన్ని రకాల వస్తువుల ధరలు తగ్గాయి. దాంతో వాయిదా పద్ధతిలో సెల్‌ఫోన్లు, వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. సెల్‌ఫోన్ షాపులు సందడితో నిండిపోయాయి. దీనికితోడు రూ.10 వేలకు మించి కొనుగోలు చేసిన వారికి బహుమతులు ప్రకటించడంతో.. ఆయా షాపులు కిక్కిరిశాయి. ఇలాఉండగా పిండి వంటలకు ఉపయోగపడే నూనె, పప్పులు, బియ్యం, బెల్లం ధరలతో పాటు, దుస్తుల ధరలపై ఎటువంటి మార్పు లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సామర్లకోటలో వెలవెలబోయిన వస్త్ర దుకాణం


కొనుగోలుదార్లతో సెల్‌ఫోన్ షాపులో రద్దీ

సామాన్య అమ్మకాలూ లేవు



దుస్తుల షాపుల్లో సాధారణంగా రోజుకు రూ.వెయ్యి వరకు అమ్మకాలు జరుగుతాయి. దసరాకు 15 రోజుల పాటు రోజుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఆ సందడి కనిపించడం లేదు. 15 ఏళ్లుగా సామర్లకోటలో వస్త్ర వ్యాపారం చేస్తున్నాను. షాపు అద్దె, వర్కర్లకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ వ్యాపారం చిరు వ్యాపారుల పొట్టకొడుతుంది.

– రాము వీరబాబు, వస్త్ర వ్యాపారి, సామర్లకోట

తగ్గని నూనెలు, పప్పుల ధర



పండగలు అనగానే పిండి వంటలు సర్వసాధారణం. జీఎస్టీ తగ్గించామని ప్రచారం మినహా పేద ప్రజలకు ఏ విధమైన ప్రయోజనమూ లేదు. నూనె, పప్పుల ధరలు అసలు తగ్గలేదు. చిన్న పిల్లల సబ్బుల ధరలూ పెరిగాయి. దుస్తులపై జీఎస్టీ తగ్గింపు లేదు. గతంలో పండగ సమయంలో వైఎస్సార్ చేయూత పథకంలో పండగ ఆనందంగా జరుపుకొనేవారు.

– రేలంగి వెంకటలక్ష్మి, గృహిణి, వీకే రాయపురం

వేట్లపాలెంలో నేడు బేతాళ సంబరం


విద్యుద్దీపాలంకరణలో బేతాళ స్వామి ఆలయం

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో నిర్వహించే బేతాళ సంబరానికి ఓ ప్రత్యేకత ఉంటుంది. శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని గ్రామ శివారులో ఉన్న బేతాళ స్వామిని భారీ ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామంలోని ఆలయంలో ఉంచారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, పారాయణ నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భారీఎత్తున బేతాళ సంబరం వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు కొండపల్లి జగ్గారావు, సూరన్నచౌదరి, కాకర్ల గంగాధర్, గద్దె సాయిరాం తెలిపారు. సంబరాన్ని తిలకించడానికి గ్రామానికి చెందిన వారు ఏ రాష్ట్రంలో, ఏ దేశంలో ఉన్నా తప్పనిసరిగా హాజరుకావడం ఆనవాయితీగా వస్తోంది. సంబరాన్ని పురస్కరించుకుని గ్రామంలో నైవేద్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిండి వంటలు తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేస్తారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గ్రామమంతా బేతాళస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ముగింపు సందర్భంగా బేతాళ స్వామిని గ్రామ శివారుకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చి వేస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి భారీ బాణసంచా కాల్పులు ఉంటాయి.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

- పార్టీ నియోజకవర్గ కో– ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- డిజిటల్ బుక్ ఆవిష్కరణ

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నారు. అవినీతి లేకపోయినా, తప్పులు చేయకపోయినా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులకు గురైన వారి వివరాలు నమోదు చేయడానికి యాప్ ద్వారా డిజిటల్ బుక్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు వారాల క్రితం ఆవిష్కరించారని తెలిపారు. ఎవరి వల్ల వేధింపులకు గురయ్యారు, కేసు పెట్టిన అధికారుల వివరాలను అన్యాయానికి గురైన పార్టీ శ్రేణులు ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా వివరాల ఆధారంగా విచారణ చేసి పార్టీ అధినేత నోట్ చేసుకుంటారని చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన వారెక్కడా ఉన్నా చట్టసభలో శిక్ష పడేలా చేస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యాప్‌ను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేస్తారని దొరబాబు తెలిపారు. ప్రతి గ్రామంలో కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్డుల ఆధారంగా అధినేతను కలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి కార్యకర్తకు బీమా చేయించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పార్టీ జిల్లా పరిషత్ విభాగం అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అల్లిలి వెంకట సీతారామస్వామి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బంగారు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరబాబు, జిల్లా అధికార ప్రతినిధి వినుకొండ విష్ణుచక్రం, జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, పట్టణ అధ్యక్షుడు సేపెని సురేష్, మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, ఉపాధ్యక్షుడు నిడదవోలు రాంబాబు, గోపు మురళీ, సీమన్నదొర, పుట్టా సూరిబాబు, ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సామర్లకోటలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న దొరబాబు తదితరులు

వయోజనుల హక్కులను గుర్తించాలి

- ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం(సామర్లకోట): ప్రతి ఒక్కరూ వయోజనుల హక్కులను గుర్తించి, వారిని గౌరవించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రపంచ వయోజనుల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దల నుంచి అనేక సూచనలు, సలహాలను తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. వృద్ధులకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. వృద్ధుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం శిక్షకు గురవుతారని హెచ్చరించారు. అనాథలుగా ఉన్న వృద్ధులను గుర్తిస్తే ట్రిబ్యునల్ సమక్షంలో వారికి రక్షణ కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ వృద్ధాప్యం వస్తుందనే విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించాలన్నారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ వృద్ధుల కోసం వృద్ధాశ్రమం నిర్మించేందుకు కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సీనియర్ సిటిజన్ సంఘ అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి, వృద్ధులు, తల్లిదండ్రులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాసు, కాకినాడ సంఘ ప్రతినిధులు ఆర్ఎస్ సుధాకర్, ఎం భాస్కరరావు, టి.శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అత్తాకోడళ్లను, సీనియర్ సిటిజన్లను సత్కరించారు.


ఉత్తమ అత్తాకోడళ్లను సత్కరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి తదితరులు

ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం నేడు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం గురువారం సాయంత్రం జరుగుతుందని ఈఓ బళ్ల నీలకంఠం బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ పాలక మండలి సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ట్రస్టు బోర్డులో కంటే జగదీష్‌మోహనరావు, చీమలకొండ వీరభద్రప్రసాదరావు, తాతపూడి అరుణ్‌వంశీ, గొర్తి సత్యనారాయణ, అలోక్ చంద్ర జైన్, కంచర్ల సుష్మమోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భానువెంకటపద్మ, బాడితమాని లక్ష్మి, గోనిపాటి బుల్లెమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యునిగా సన్నిధిరాజు వెంకటరమణను నియమించినట్టు వివరించారు. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కంటే జగదీష్‌మోహనరావును ఎన్నుకుంటారన్నారు.

మహాశక్తీ.. పాహిమాం..

- విశేషాలంకరణల్లో అమ్మవారి దర్శనం
- నేడు విజయ దశమి


చేబ్రోలులో దుర్గాదేవి అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలతో విరాజిల్లుతున్న కనకదుర్గ ఆలయాలు దశమి ఉత్సవానికి సిద్ధమయ్యాయి. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీదేవి మహిషాసురమర్దినిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురుహూతికాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని కనకదుర్గ ఆలయాల్లో దశమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ వ్యాపార సంస్థలు దసరా ప్రత్యేక పూజలకు తమ కార్యాలయాలను సిద్ధం చేశారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న లలితాదేవి అమ్మవారికి దుర్గాష్టమి, మహార్నవమి సమయంలో సహస్ర కుంకుమార్చన చేసి, నిమ్మకాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించగా, పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపు ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు. పాదగయ క్షేత్రంలో దసరా పూజలకు భారీ ఏర్పాట్లు చేయగా, నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో దుర్గాదేవి అమ్మవారికి వందలాది మంది మహిళలు బోనాలు సమర్పించారు.

ప్రత్యేక ఏర్పాట్లు

శరన్నవరాత్రుల్లో అతి ముఖ్యమైన విజయ దశమి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం నిర్వహించే ప్రత్యేక పూజలకు భక్తులంతా పాల్గొనేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించి, ఉత్సవాలకు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో ప్రముఖ కనకదుర్గ ఆలయాలతో పాటు, వివిధ గ్రామాల్లో దుర్గాదేవిని ప్రత్యేక మండపాల్లో నిలిపి విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టడంతో గ్రామాలు ఎరుపెక్కాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లోను వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టారు. దీక్షల విరమణకు విజయవాడ బయలుదేరారు.

భవానీ నామస్మరణ

కొత్తపల్లి: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ధర్మశాస్తా ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. గాదులదొడ్డిలోని బాలకనకదుర్గ ఆలయంలో పూజలు జరిగాయి. కొండెవరంలోని కనకదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. కొమరగిరిలో బాలకనకదుర్గాదేవి మహాకాళీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాకతిప్ప సతీష్‌చంద్ర కాలనీలో గురుస్వామి పథం త్రిమూర్తులు బాలదుర్గా గురుపీఠంలో అమ్మవారికి కుంకుమపూజలను నిర్వహించారు. భారీ అన్న సమారాధన జరిగింది. సుమారు 2 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వాకతిప్ప శెట్టిబలిజపేటలోని కనకదుర్గాదేవి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. కొండెవరం కనకదుర్గా దేవి ఆలయం వద్ద దసరా ఉత్సవాల్లో భాగంగా శక్తి వేషధారణలు అలరించాయి.

రాజరాజేశ్వరీదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీదేవి బుధవారం రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి దుర్గాసప్తశతి పారాయణ, బాలా పరమేశ్వరీ మంత్ర జపం, కుంకుమ పూజలు, మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం, రుద్రహోమం, సహస్ర చండీహోమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దంపతులు పూజలు చేశారు. అమ్మవారిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతోను, కుమారారామ భీమేశ్వరస్వామిని వెండి ఆభరణాలతో అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం దశమిని పురస్కరించుకుని శమిపూజ, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ నీలకంఠం తెలిపారు. పట్టణంలోని అయోధ్య రామపురంలో కనకదుర్గ, సత్తెమ్మ తల్లి ఆలయంలోను, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయంలోను, గొంచాల గ్రామంలో మాజీ సర్పంచ్ ముమ్మిడి వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలోను పూజాది కార్యక్రమాలు జరిగాయి.


విశేషాలంకరణలో పురుహూతికా అమ్మవారు


కొత్తపల్లిలో కూరగాయలతో అలంకృతులైన కనకదుర్గమ్మ


సర్వాంగసుందరంగా పాదగయ క్షేత్రం


కొండెవరంలో శక్తి వేషధారణలు


పంచారామ క్షేత్రంలో చండీహోమం


పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి


సామర్లకోట పంచారామ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవిగా బాలాత్రిపురసుందరి


రాజరాజేశ్వరీదేవి అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి


దుర్గాడలో ప్రత్యేకాలంకరణలో లలితాదేవి


కొత్తపల్లిలో కనకదుర్గమ్మకు అభిషేకం చేస్తున్న పండితులు


కొమరగిరిలో మహాకాళిదేవిగా అమ్మవారు